# ధీరోదాత్తుడు నటసమ్రాట్ అక్కినేని

## ప్రతిభా పురస్కారాల సభలో ప్రముఖులు

తెనాలి

ప్రతికూల జీవన పరిస్థితులను తట్టుకుంటూ పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగిన అక్కినేని నాగేశ్వరరావు ధీరోదాత్తుడు అని, తెలుగు సినిమా చరిత్రలో చిరస్మరణీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. నటసమ్రాట్ డాక్టర్ అక్కినేని ఇంటర్నేషనల్ ఫ్యాన్స్, వెన్నం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంయుక్త నిర్వహణలో మంగళవారం రాత్రి స్థానిక రాధాకృష్ణ కల్యాణమండపంలో అక్కినేని ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. చైతన్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఉపాధ్యక్షుడు రవి కొండబోలు మాట్లాడుతూ, అభిమానుల దీవెనలే తనకు ఆయుష్షుగా చెబుతూ, ఆత్మవిశ్వాసంతో జీవించిన అక్కినేనితో తనకు గల చిరకాల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 2016లో అక్కినేని పురస్కారాలను చెన్నైలో ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. 'తానా' మాజీ అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ మృత్యువుకు ఏనాడూ భయపడని అక్కినేని, చివరివరకు దానితో పోరాడారని చెప్పారు. ప్రముఖ కార్డియాలజిస్ట్, ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి, అక్కినేని సినిమాల్లోని పాటలను ఆలపిస్తూ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. తాను ఏడెనిమిదేళ్లపాటు అక్కినేనికి గుండె పరీక్షలు చేస్తూ సన్నిహితంగా ఉన్నట్టు చెప్పారు. శిల, శిల్పి, శిల్పము ఆయనేనని సోదాహరణంగా చెప్పారు.



సత్కారం అందుకున్న కొత్త సుబ్రహ్మణ్యం, ఎంపీ కన్నేశ్వరరావు, తోటకూర ప్రసాద్, యడ్ల బ్రహ్మాజీరావు, బొల్లిముంత కృష్ణ

సినీరచయిత ఎస్వీ రామారావు స్వాగతం పలికిన సభలో డాక్టర్ తోటకూర ప్రసాద్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, నటుడు, ప్రయోక్త ఎంపీ కన్నేశ్వరరావు, సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ, పట్టణానికి చెందిన వైద్యుడు డాక్టర్ యడ్ల బ్రహ్మాజీరావులను ఘనంగా సత్కరించారు. జి.రామనాగేశ్వరరావు, కాకుమాను రాంబాబు, షేక్ ఇబ్రహీం, తుమ్మల ప్రవీణ్, జీవీ శివన్నారాయణ పర్యవేక్షించారు. ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య కూచిపూడి నృత్యం, అంతకు ముందు అక్కినేని జైత్రయాత్ర డాక్యుమెంటరీని ప్రదర్శించారు.